# తెలంగాణపై మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

- ఆపార్టీపై తిరగబడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు..
- కుటుంబపాలనపై ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు విడ్డూరం
- రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ రాహుల్ గాంధీ ఆరోపించడం హాస్యాస్పదం
- తెలంగాణ వ్యతిరేకి, ద్రోహి రేవంత్‌రెడ్డి..
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నందిపేట్, అక్టోబర్ 19 : సకల జనులందరూ కలిసి సాధించుకున్న ప్రజాతెలంగాణపై మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కుటుంబ పాలనపై ప్రియాంక గాంధీ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీపై తిరగబడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి కవిత మాట్లాడారు. తెలంగాణపై రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ లేనిపోని ఆరోపణలు చేశారని అన్నారు. వారు సత్యదూరమైన అంశాలను మాట్లాడారన్నారు. వారు చెప్పేవి చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను రాహుల్‌గాంధీ చదువుకున్నారని, ఆయన వైఖరిని మార్చుకోవాలని సూచించారు. రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్‌గాంధీ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ వ్యయం కలిపితే రూ.లక్ష కోట్లలోపే ఉందని తెలిపారు. రూ.లక్ష కోట్ల కన్నా తక్కువ ఖర్చు చేసిన ప్రాజెక్టులో లక్షల కోట్ల అవినీతి ఎలా చేస్తారన్నది ఆలోచించాలని సూచించారు. ఏది పడితే అది మాట్లాడితే ఓట్లు వస్తాయనుకోవడం అమాయకత్వమవుతుందన్నారు.

**కాంగ్రెస్ హయాంలోనే అవినీతి**

కాంగ్రెస్ హయాంలో అవినీతి జరిగిందని, ఎస్సారెస్పీ పూర్తి కావడానికి 60 ఏండ్ల సమయం పట్టిందన్నారు. మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మొదలుపెట్టిన ప్రాజెక్టును కూడా తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ పూర్తి చేసిన పరిస్థితి అని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్క చేకుండా పోరాటం చేసిన కేసీఆర్ మీద అవాకులు చెవాకులు మాట్లాడడం ప్రజలు తట్టుకోలేకపోతున్నారనిన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తిరగబడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పారదర్శకంగా కష్టపడి పని చేశాం కాబట్టే పొలాల్లో నీళ్లు ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌వి దొంగ,అబద్ధపు వాగ్దానాలని దీనిపై ఆలోచన చేయాలని ప్రజలను కోరారు. అద్దాల మేడలో కూర్చొని ఇతరులపై రాళ్లు విసరొద్దని, ఏం మాట్లాడుతున్నారో ఆలోచించుకుని మాట్లాడాలని హితవు పలికారు. ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపితే మరి భూమికి హక్కుదారులెవరో ఎలా తెలియాలని ప్రశ్నించారు. రైతుబంధు, రైతు బీమా ఎలా రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పొరపాటున అధికారంలోకి వస్తే ధరణి మాత్రం గ్యారంటీగా గుల్ల అవుతుందన్నారు.

**రైతులంటే కాంగ్రెస్‌కు చిన్నచూపు**

రైతులంటే కాంగ్రెస్‌కు ఎంత చిన్నచూపో అర్థం చేసుకోవాలన్నారు. అది వాళ్ల తెలంగాణ... వీళ్ల తెలంగాణ అని కూడా మాట్లాడుతున్నారని, ఇది సకల జనులు కలిసి సాధించుకున్న ప్రజాతెలంగాణ అని స్పష్టం చేశారు. సబ్బండ వర్గాల సంతోషం, అభివృద్ధి కోసం ప్రజలంతా కలిసి కాంగ్రెస్ మీదే పోరాటం చేసి తెలంగాణ సాధించుకునామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు తెలంగాణ ద్రోహులకు, తెలంగాణ ప్రేమికులకు మధ్య జరుగుతున్నవని అభివర్ణించారు. 2004లో తెలంగాణ ఇస్తామని హామీనిచ్చి పదేండ్ల పాటు నెరవేర్చకపోతే వందలాదిమంది యువకుల బలిదానాలకు కాంగ్రెస్ పార్టీ కారణమైందన్నారు. అప్పుడే తెలంగాణ ఇచ్చి ఉంటే ఇప్పటివరకు తెలంగాణ ఎంతగానో అభివృద్ధి అయ్యేదన్నారు. గుత్ప ఎత్తిపోతల పథకాన్ని రూ.25 కోట్లతో మరమ్మతు చేశామన్నారు. ఫత్తేపూర్ లిఫ్ట్, మాక్లూర్ లిఫ్ట్ ఇలా తదితర వాటికి రూ.350 కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

# పీచేమూడ్!

- జిల్లాలో రాహుల్ పర్యటన కుదింపు
- సర్వత్రా చర్చనీయాంశంగా మారిన వైనం
- ప్రజాదరణ లేకపోవడంతోనేనని కుదించారని ప్రచారం
- ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభంజనంతో కాంగ్రెస్ కుదేలు

నిజామాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ముఖ్య నాయకుడు రాహుల్‌గాంధీ నిజామాబాద్ జిల్లా పర్యటనలో మార్పులు చోటు చేసుకున్నాయి. నిజామాబాద్ నగరంలో రాహుల్ బస్సుయాత్ర చివరి నిమిషంలో రద్దయింది. ప్రజల నుంచి ఊహించిన రీతిలో ఆదరణ కనిపించే పరిస్థితి లేకపోవడంతోనే అగ్రనేత టూర్‌ను కుదించినట్లు ప్రచారం జరుగుతున్నది. వాస్తవానికి తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆర్మూర్‌తో పాటు నిజామాబాద్ నగరంలోనూ పర్యటిస్తారని కాంగ్రెస్ కొద్ది రోజులుగా ఊదరగొట్టింది. చివరకు సమయం దగ్గరకు వచ్చేసరికి ‘చేతు’లెత్తేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో హస్తం పార్టీ తీరుపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభంజనంతో కుదేలైన కాంగ్రెస్‌కు ప్రజాదరణ దక్కకపోవడంతో ఆ పార్టీ నేతలు డీలా పడ్డారు.

ప్రజాదరణ లేకే..?అంతర్గత కుమ్ములాటలు..

సఖ్యత లేని నాయకత్వంతో సతమతమవుతున్న కాంగ్రెస్‌కు తాజాగా మరో పరాభవం ఎదురైంది. చివరి నిమిషంలో రాహుల్ పర్యటనను కుదించడం ద్వారా ప్రజల్లో చులకన అయింది. వాస్తవానికి రాహుల్‌గాంధీ బస్సు యాత్రతో నిజామాబాద్ జిల్లాలో ఏదో చేసేస్తామంటూ నెల రోజుల నుంచి ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు గప్‌చుప్ అయ్యారు. జిల్లాలో రాహుల్ పర్యటనను కుదించి, ఒకే ఒక కార్యక్రమంతో పరిసమాప్తం చేస్తుండటం వెనుక వారికి గెలుపు అవకాశాలు లేకపోవడమే కారణమని ప్రచారం జరుగుతున్నది. ముఖ్య నాయకుడిని తీసుకొస్తున్నప్పటికీ, జనం రాకపోతే పార్టీ పరువు పోతుందన్న ఉద్దేశంతోనే పర్యటనను కుదించినట్లు తెలిసింది. అంతర్గతంగా కొట్లాటలతో బజారుపడి పరువు తీసుకునే బదులు మిన్నకుండటం ఉత్తమమనే అభిప్రాయంతోనే ఇదంతా జరిగిందన్న ని ప్రజలు అనుకుంటున్నారు.

అభ్యర్థులే లేని పరిస్థితి..

అభ్యర్థుల ఖరారుతో పాటు ఇప్పటికే ఎన్నికల ప్రచారంతో బీఆర్ఎస్ దూసుకెళ్తుంటే, కాంగ్రెస్ పార్టీ కనీసం అభ్యర్థులను కూడా ప్రకటించని లేని దుస్థితిలో ఉన్నది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ అభ్యర్థులనే ఖరారు చేయలేదు. బరిలో నిలవాల్సిన వ్యక్తులెవరో ఇప్పటి వరకు తేల్చలేదు కానీ ప్రచార పర్వానికి అగ్రనేతలను బరిలోకి దింపడంపై ప్రజల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో కేవలం 3 సీట్లలోనే అభ్యర్థులను ప్రకటించి చేతులు దులుపుకుంది. మిగిలిన చోట్ల అభ్యర్థులే కరువయ్యారని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. టికెట్ల కోసం బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లిన ఆశావాహులు మినహా అదే పార్టీలో పని చేస్తూ టికెట్ కోసం డిమాండ్ చేస్తున్న వారి సంఖ్య చాలా స్వల్పంగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం ఆసన్నమవుతున్న వేళా అభ్యర్థుల ప్రకటనలో తాత్సారంతో పార్టీ క్యాడర్ పక్క చూపులు చూస్తున్నది. భారీగా ప్రజాదరణతో ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్‌లోకి చేరేందుకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే చాలాచోట్ల కాంగ్రెస్‌ను వీడి కారెక్కారు. రానున్న రోజుల్లో చేరికలు మరింత ఊపందుకోనున్నాయి.

## ఎదురేలేని బీఆర్ఎస్

అధికార బీఆర్ఎస్ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించుకుని ప్రచారంలో దూసుకు పోతున్నది. నాయకులంతా ప్రజాక్షేత్రంలోనే ఉండి ప్రచారంచేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటికే నియోజకవర్గాన్ని ఒకసారి చుట్టేశారు. ఇక ప్రచార జోరును పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ జనం ఇబ్బందులను, సమస్యలను ఆలకిస్తూ వచ్చే ప్రభుత్వంలో చేయాల్సిన మరింత అభివృద్ధిని, చేపట్టాల్సిన నూతన కార్యక్రమాలపై ప్రజలతో మమేకమవుతున్నారు. భారీ మెజార్టీయే లక్ష్యంగా బీఆర్ఎస్ దూసుకుపోతున్న వేళా కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటివరకు అభ్యర్థులను సైతం సరిగా ప్రకటించుకోలేక చతికిల పడింది.



పాపకు చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

### నెలలు నిండని చిన్నారికి

## ప్రాణం పోసిన 108 సిబ్బంది

ఖలీల్‌వాడి, అక్టోబర్ 19 : నిజామాబాద్ నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన పూజా ఐదు నెలల గర్భవతి. గురువారం ఒక్కసారిగా నొప్పులు రావడంతో ఆశవర్కర్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించింది. 108 వాహనం పూజ ఇంటికి చేరుకునే లోగా ఆమె ప్రసవించింది. పాప పరిస్థితిని గమనించిన 108 సిబ్బంది మమత, రాజయ్య మోకస్ సాకర్ పరికం సాయంతో సీపీఆర్ చేయగా.. పాప స్పందించడంతో దవాఖానకు తరలించారు. 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏసీబీ వలలో అవినీతి చేప



పట్టుబడిన నగదు

- కారు అద్దె బిల్లు మంజూరుకు డీఈఐఈ రూ.9 వేలు డిమాండ్
- అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించిన బాధితుడు
- డీపీఆర్వో కార్యాలయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం..
- కేసు నమోదు.. కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్న అధికారులు

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 19 : తాను తిరుగుతున్న కారు అద్దె బిల్లు మంజూరు చేసేందుకు డీపీఆర్వోలో పని చేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ లంచం డిమాండ్ చేసి చివరికి ఏసీబీ అధికారులకు పట్టుబడింది. గురువారం మధ్యాహ్నం సమయంలో నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ఉన్న డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీస్ (జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ)పై ఒక్కసారిగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడంతో ఇతర శాఖల అధికారులు అయోమయానికి గురయ్యారు. బాధితుడు, అవినీతి నిరోధక శాఖ డీజీ(డైరెక్టర్ జనరల్) తెలిపిన మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరానికి చెందిన కోనేటి విజయ్ కుమార్ అనే వ్యక్తి తన కారును డీపీఆర్వో కార్యాలయంలో డిప్యూటి ఎగ్జిక్యూటీవ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సి.వేణి ప్రసన్న అనే అధికారిణి వద్ద అద్దెకు పెట్టాడు. ఆమె తన డ్యూటీలో భాగంగా నిత్యం కారును వాడుకునేది. అందుకు గాను ప్రతి నెలా రూ.33 వేల అద్దె అగ్రిమెంట్ చేసుకున్నారు. కారుకు మూడు నెలల నుంచి బిల్లులు రాలేదు. తనకు ఆఫీస్ నుంచి రావాల్సిన రూ.99 వేల బిల్లు మంజూరు అయ్యేలా చూడాలని విజయ్ కుమార్.. వేణి ప్రసన్నను కోరాడు. దీంతో మూడు నెలల బిల్లులకు గాను నెలకు రూ.3 వేల చొప్పున రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. తనకు న్యాయంగా రావాల్సిన డబ్బులకు లంచం ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు ఇచ్చిన సలహా మేరకు గురువారం లంచం డబ్బులు అధికారిణికి ఇచ్చేందుకు డీపీఆర్వో ఆఫీస్‌కు వెళ్లాడు. అప్పటికే మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో రెండు జిల్లాల అధికారులు, సిబ్బంది కలెక్టరేట్ వద్ద నిఘా పెట్టారు. విజయ్ కుమార్ రూ.9వేలు లంచం డబ్బులను డీఈఐఈ వేణి ప్రసన్నకు ఇవ్వగానే దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం సదరు అధికారిణిపై కేసు నమోదు చేసి, కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. ఈ దాడిలో నిజామాబాద్ జిల్లా ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు నగేశ్, శ్రీనివాస్, మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్లు వెంకట రాజ గౌడ్, రమేశ్‌తో పాటు రెండు జిల్లాల సిబ్బంది ఉన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.

NT-320501

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.